క్లుప్తంగా

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో శనివారం దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. పుంగనూరుకు చెందిన శంకరప్పకు బ్యాటరీ సైకిల్, మదనపల్లెకు చెందిన మున్వర్‌బేగంకు వీల్‌చైర్, గుంటూరు జిల్లా కొప్పర్‌కు చెందిన వెంకటేశ్వర్లుకు హియరింగ్ కిట్, చేతికర్రలను సంస్థ కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి అందజేశారు.

ఆలయానికి విరాళం

ములకలచెరువు: మండలంలోని మద్దినాయునిపల్లి పంచాయతీ గ్రద్దాజులపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయానికి మండలానికి చెందిన పారిశ్రామిక వేత్త జయచంద్రారెడ్డి శనివారం విరాళాన్ని అందించారు. ఆలయ గోపురం నిర్మాణానికి రూ. లక్ష విరాళం అందించినట్లు చెప్పారు.

నేతన్న నేస్తంపై లబ్ధిదారులు హర్షం

ములకలచెరువు: వైఎస్సార్ నేతన్న నేస్తం లబ్ధిదారులు శనివారం మండలంలోని వేపూరికోటలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఎదుట కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం నేతన్నల ఖాతాల్లో నగదు జమ చేయడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ సునీత, నాయకులు సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విశ్వం డిగ్రీ,పీజీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

కురబలకోట: మదనపల్లె దగ్గర అంగళ్లు మార్గంలోని విశ్వం డిగ్రీ, పీజీ కళాశాలకు న్యాక్ సాంకేతిక బృందం ఏ గ్రేడ్ గుర్తింపు ఇచ్చినట్లు కళాశాల చైర్మన్ ఎం. ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సి. రఘునాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు ఇటీవల న్యాక్ బృందం కళాశాల నిర్వహణపై మదింపు నిర్వహించిందన్నారు. సంతృప్తి చెందిన వారు కళాశాలకు తొలిసారిగా న్యాక్ గుర్తింపును ఇచ్చినట్లు సంతోషం వ్యక్తం చేశారు. మరింత బాధ్యతాయుతంగా కళాశాలను నిర్వహిస్తామని వారు తెలిపారు.

సారా స్వాధీనం

పీలేరు రూరల్: పదిలీటర్ల సారా స్వాధీనం చేసుకొని సారావిక్రేతను అరెస్ట్ చేసినట్లు సెబ్ ఎస్ఐ పి. లక్ష్మీనరసయ్య తెలిపారు. శనివారం తమ సిబ్బందికి అందిన సమాచారం మేరకు పట్టణంలోని యల్లమందక్రాస్ వద్ద దాడులు నిర్వహించగా యల్లమంద క్రాస్‌కు చెందిన మూడే సరోజమ్మ సారా కలిగిఉండడంతో ఆమెను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. దాడుల్లో సిబ్బంది రాఘవయ్య, సుధాకర్,గంగామహేశ్వరీ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామసముద్రం: రామసముద్రం మండలం చెంబకూరులో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రమా నేత్రాలయ కంటి వైద్యులు డాక్టర్ ఎం.మహేష్ రెడ్డి శిబిరంలో 100 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వీరిలో 40 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. రమానేత్రాలయ ఆసుపత్రిలో కంటి శుక్లము, ఇతర ఆపరేషన్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ హెల్త్ కార్డు ద్వారా కంటి ఆపరేషన్లు , ఆరోగ్యశ్రీలో కంటి ఆపరేషన్ల సదుపాయం ఉందని చెప్పారు.

శ్రీ లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక శ్రావణ మాసం ప్రారంభం కావడంతో శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు.

ఆలయానికి ఇనుపపెట్టె విరాళం

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి రూ.లక్ష విలువ గల ఇనుప పెట్టెను శనివారం భక్తుడు విరాళంగా ఇచ్చారు. బి.కొత్తకోట మండలం గొల్లపల్లె రైస్‌మిల్ రామిరెడ్డి , సుజాత దంపతుల కుమారుడు మంజునాథరెడ్డి, ఉదయశ్రీలు ప్రత్యేకంగా ఈ పెట్టెను తయారు చేయించారు. ప్రత్యేక వాహనంలో మల్లయ్యకొండపైకి తరలించారు. భక్తులు సమర్పించే విలువైన కానుకలు, ఆలయానికి సంబంధించిన విలువైన సామగ్రిని అందులో భద్రపరిచేందుకు సౌకర్యం కల్పించారు. భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవిలను ఆలయ పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు సాదరంగా ఆహ్వానించి స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

ఎమ్మెల్యే నవాజ్‌బాషా


మంచిగుంటపల్లెలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మంచిగుంటపల్లె, అగ్రహారం గ్రామాల్లో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ ఉషారాణి ఆధ్వర్యంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డిలతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను పలుకరించారు. నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. ఏమైనా సమస్యలున్నా... అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. జగనన్న పాలనలో ఆయా కుటుంబాలకు కలిగిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. బుక్‌లెట్‌ను అందించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ఓ వైపు అభివృద్ధి పనులు జోరుగా చేపడుతూనే మరోవైపు నిర్విరామంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలవద్దకే తీసుకువచ్చేలా ఆయన ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శమన్నారు. గతంలో టీడీపీ తన మేనిఫెస్టోలోని ఇచ్చిన హామీల్లో ఒక శాతం కూడా నెరవేర్చలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తన మేనిఫెస్టోలోని 98 శాతానికి పైగా హామీలను నెరవేర్చిందన్నారు. ప్యాకేజీస్టార్ పవన్‌కల్యాణ్‌తో కలిసి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించే పనిలో టీడీపీ ఉందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నేతలు మరోసారి తమ మాయమాటలతో ప్రజలను మోసగించేందుకు సిద్ధమయ్యారని, వారిని నమ్మి ఓట్లు వేస్తే ఇప్పటి సంక్షేమ పథకాలన్నీ మాయమవుతాయన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రహ్మణ్యం, చంద్రాయుడు, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ కుసుమ, నాయకులు కైలాసపతి, దయాకర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, ఉదయ్‌శేఖర్ రెడ్డి, సుధాకర, వెంకటరమణ, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, వెంకటరమణారెడ్డి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీ, రూరల్‌లో మంజూరైన అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నగర పంచాయతీలో సచివాలయ ఉద్యోగులతో, మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి పనులు, సమస్యలపై సమీక్షించారు. నగర పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో నిధులు మంజూరు చేయిస్తున్నట్లు చెప్పారు. జీజీఎంపీ కింద ఐదు సచివాలయాలకు రూ.కోటి మంజూరైనా రూ.30 లక్షల పనులే పూర్తి చేశారని అసహనం వ్యక్తం చేశారు. రూ.80లక్షల ఎంపీ నిధుల్లో రూ.36 లక్షల పనులు చేశారు. మురికినీటి కాలువలు, రోడ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంవత్సరం నిధులు రూ.1.36 కోట్లు, జగనన్నకాలనీలు కురవానికుంట, బద్దిపల్లె లేఅవుట్లకు మంజూరైన రూ.2.70 కోట్లతో మౌలిక వసతుల కల్పన పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అమృత్ పథకం కింద మంజూరైన తాగునీటి సరఫరాకు రూ.5.20 కోట్లు, పెద్దచెరువు అభివృద్ధికి రూ.2 కోట్ల పనులపై సమీక్షించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీలవారీగా శాఖలవారీగా సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే పేదలకు ఇళ్లస్థలాల మంజూరుకు సంబంధించి సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీరంగి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి రెవెన్యూ సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్ డీఈ విజయమోహన్ , ఆర్‌బ్ల్యూఎస్ ఏఈ దినేష్‌కుమార్, ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీపీ లక్ష్మినరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, సింగిల్‌విండో చైర్మన్ అమరనాథ్, మాజీ ఎంపీపీ పాగొండ ఖలీల్, వైస్‌ఎంపీ రాధ, సర్పంచులు గిరిజ రఘునాథరెడ్డి, వెంకటరమణ, ఉజ్జయిని సాంబశివ, లక్ష్మీదేవమ్మ, ఉమామహేశ్వరీ, అధికారులు పాల్గొన్నారు.

మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించండి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తూ, ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎనుగొండపాళ్యం పంచాయతీ చీకెలిబైలుపల్లె, కోరేవాండ్లపల్లె, ఎగువపాళ్యెం, గొళ్ళపల్లె, ఒంటిల్లు, రంగప్పగారిపల్లె గ్రామాలలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి, అందిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. ఎగువపాళ్యెంలోమురుగు నీటికాలువలు, చీకెలిబైలుపల్లెలో విద్యుత్‌స్తంబాలు, ఆరుగురికి పింఛన్లు, ఏడుగురికి ఇళ్లు, 10 మంది రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని కోరగా వెంటనే అంచనాలు వేసి, మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. గొళ్ళపల్లెలో సిమెంట్‌రోడ్లు, మురుగునీటి కాలువలు కోరగా ఎమ్మెల్యే నిధులతో వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను, సర్పంచ్‌ను ఆదేశించారు. నీటిపైపులు, వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు అంచనాలు వేయాలన్నారు. మరమ్మతుకు గురైన 26 విద్యుత్ స్తంభాలు, రైతులకు అవసరమైన 12 సర్వీసులను వెంటనే ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు హారిక శివ, మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయుడు, సర్పంచ్ మంజుల, సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజనాయుడు, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల్లో పరివర్తన ముఖ్యం


మాట్లాడుతున్న సీఐ మురళీకృష్ణ

మదనపల్లె : క్షణికావేశంలో చిన్నచిన్న గొడవల వల్ల జైలు జీవితం అనుభవిస్తున్న ఖైదీలు పరివర్తన చెంది కుటుంబ సభ్యులతో సుఖజీవనం సాగించాలని టూటౌన్ సీఐ మురళీకృష్ణ అన్నారు. స్థానిక సబ్‌జైలు ఆవరణలో శనివారం ఖైదీలకు పరివర్తనపై కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ జీవితం విలువ తెలుసుకుని ప్రతి వ్యక్తి తనకు తాను సమాధానపరచుకున్నప్పుడే ప్రశాంతంగా జీవించవచ్చన్నారు. క్షణికావేశంలో నేరం చేసి అయిన వాళ్లకు, ఆప్తులకు దూరమై చాలామంది జీవితాలు దుర్భరమయ్యాయని, ఏదైనా ఒక నిర్ణయం తీసుకునేటప్పుడు ఆలోచించి తీసుకోవాలన్నారు. సత్ప్రవర్తన, క్రమశిక్షణ కలిగిన వ్యక్తులు మంచి మానవసంబంధాలు కలిగి ప్రశాంతంగా జీవించగలుగుతున్నారన్నారు. అలాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సైక్రియాటిస్ట్ డాక్టర్ రాధిక మాట్లాడుతూ.. శారీరక, మానసిక ఆరోగ్యం ఉన్నప్పుడే మనిషి సక్రమంగా జీవించగలుగుతారన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండి తమ కుటుంబాలకు అండగా ఉండాలని పేర్కొన్నారు. సబ్‌జైలు సూపరింటెండెంట్ రామకృష్ణయాదవ్ మాట్లాడుతూ.. తెలిసో, తెలియకో క్షణికావేశంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల ఫలితంగా చాలా ఇబ్బందులకు గురవుతారన్నారు. రిటైర్డ్ జైలు సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ తెలిపిన నేరాన్ని ద్వేషించు-నేరస్తున్ని ప్రేమించు అనే నినాదాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో భాగంగా గాయకులు మారప్ప, వేమనారాయణ, శ్వేత పరివర్తనకు సంబంధించిన గీతాలు ఆలపించి ఆనందింపజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వీఎస్ఆర్ గ్రాండ్ సుధాకరరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ డిజి.రామమూర్తి, సబ్‌జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్దాల కల.. ఎమ్మెల్యే కృషితో సాకారం


పూర్తయిన చల్లావాండ్లపల్లి తారు రోడ్డు పనులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూర్లపల్లి పంచాయతీ చల్లావాండ్లపల్లిలో 20 కుటుంబాల ప్రజలు నివాసం ఉంటున్నారు. ఈ ఊర్లో ప్రభుత్వ చౌక దుకాణం కూడా ఉంది. ఇదే పంచాయతీలోని సొన్నువారిపల్లి, జోగిండ్లు, బంగ్లా, కొత్తపల్లి గ్రామాల్లోని సుమారు 300 మంది కార్డుదారులు రేషన్ సరుకుల కోసం ఇక్కడకు వస్తుంటారు. అయితే ప్రతి నెలా కార్డుదారులు సరుకులు తీసుకుని వెళ్ళాలంటే రోడ్డు సౌకర్యం లేక నానా తంటాలు పడాల్సి వచ్చేది. అయితే ఊరు పుట్టినప్పటి నుంచి ఈ పల్లెకు సరైన రోడ్డు సౌకర్యం కూడా లేదు. కేవలం కాలిబాట మాత్రమే ఉండేది. అత్యవసర సమయాల్లో 108 వాహనం రావాలంటే గగనమే. మా ఊరు రోడ్డు గురించి పట్టించుకునే నాథులే లేరు, ఇక మా బతుకులంతా కాలిబాటతోనే సరిపెట్టుకోవాల్సిందే అని ప్రజలు అసహనం వ్యక్తం చేసేవారు. ఈ నేపథ్యంలో గడప, గడపకూ మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా గతంలో తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఈ పల్లెలో పర్యటించారు. సర్పంచ్ బుచ్చిగారి సుబ్బిరెడ్డి గ్రామస్థులు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఈఏపీ గ్రాంట్ నుంచి రూ.66 లక్షల నిధులను మంజూరు చేయించి రంగసముద్రం రోడ్డు నుంచి చల్లావాండ్లపల్లి వరకు కిలో మీటర్ పాటు తారు, సిమెంటు రోడ్డు వేయించారు.

శివపార్వతుల కల్యాణం

పెద్దతిప్పసముద్రం: అరుద్ర నక్షత్రం సందర్భంగా శనివారం స్థానిక పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శివ, పార్వతుల కల్యాణోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు చేశారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలు


జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న దృశ్యం

కలికిరి: తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలు అందుబాటులో ఉంచారు. తపాలా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలో కార్యాలయంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని బ్రాంచ్ కార్యాలయాల్లో సైతం జాతీయ జెండాలు విక్రయానికి ఉంచారు. మొదటి సారిగా ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలు అందుబాటులో ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రజలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. మేడికుర్తి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ప్యాకర్ కె.కుమార్ ఒకేరోజు కార్యాలయానికి కేటాయించిన 50 జాతీయ జెండాలను స్థానికులకు అవగాహన కల్పించి విక్రయించడంతో ఉన్నతాధికారులు ఆయన్ను అభినందించారు.

పెద్దతిప్పసముద్రం: పంద్రాగస్టు సందర్భంగా పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయని స్థానిక ఎస్‌పీఎం రెడ్డిశేఖర్ శనివారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామీణ ప్రాంతాల్లోని బ్రాంచి పోస్టాఫీసుల్లో ఒకొక్క జెండాను రూ.25 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ బీటీ కాలేజీలో శనివారం ఏఐఎస్‌ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వంచారు. నియోజకవర్గ కార్యదర్శి మాధవ్ జెండాను ఆవిష్కరించారు. మాజీ ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు కృష్ణప్ప మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఏఐఎస్‌ఎఫ్ నిరంతర పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. బీటీ కాలేజీ ప్రభుత్వ పరం చేయడానికి 288 రోజులు సుదీర్ఘ పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. విద్యార్థులందరూ ఏఐఎస్‌ఎఫ్‌లో చేరాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఓబులేసు, ఉపాధ్యక్షుడు వినయ్, బాలకృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు


కేవీపల్లె : మండలంలోని నూతనకాల్వ పంచాయతీ చెరువుముందర కమ్మపల్లెకు తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. శనివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, జెడ్పీటీసీ గజ్జెల శృతి జేసీబీ, హిటాచీలకు పూజలు చేసి పనులు మొదలు పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువుముందరకమ్మపల్లెకు రోడ్డు సమస్య గురించి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి తారు రోడ్డు మంజూరు చేపించినట్లు తెలిపారు. సుమారు రూ. 3 కోట్లతో రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పొత్తపు సతీష్‌రెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, కోర్టు సుబ్బారెడ్డి, సిద్దయ్య, ఆంజినేయులు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీసీలోకి చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరుతున్న బీదం మల్లికార్జున తదితదరులు

కలకడ : టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి 10 కుటుంబాలు చేరాయి. కలకడ మండలం ఎనుగొండపాళ్యం పంచాయతీ గొళ్ళపల్లెకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు బీదం మల్లికార్జున అతని అనుచరులు 10 కుటుంబాలతో వైఎస్సార్ సీపీలో చేరారు. శనివారం మండలంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో మండల సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజు, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయుడుల ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

జోయాలుకాస్ మెగా ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

పీలేరు : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో జోయాలుకాస్ మెగా ఎగ్జిబిషన్‌ను శనివారం సీఐ మోహన్‌రెడ్డి, ఎంఎన్ఆర్ అధినేత మదనమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జోయాలుకాస్ ప్రతినిధులు శ్రీజైస్, జానకిరామ్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు. వందల రకాల డిజైన్లలో బంగారు, డైమండ్ ఆభరణాలు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. డైమండ్స్ కొనుగోలుపై 25 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు చెప్పారు. పాత బంగారం ఇచ్చేవారికి ప్రస్తుత మార్కెట్ రేటు కంటే అదనంగా గ్రాముకు రూ. 75 అదనంగా చెల్లిస్తామని తెలిపారు. అవకాశాన్ని పీలేరు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇళ్ల మధ్య అనుమతి లేకుండా బ్లాస్టింగ్‌లా?


దేవతానగర్ ఏడోక్రాస్‌లో అనుమతి లేకుండా చేస్తున్న బ్లాస్టింగ్ పనులు

మదనపల్లె : మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ దేవతానగర్ ఏడో క్రాస్ చివరన ఓ రియలర్ అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతి లేకుండా ఇళ్ల మధ్య జిలెటిన్ స్టిక్స్‌ను అమర్చి పేలుళ్లకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని స్థానికులు ఆరోపించారు. శనివారం సాయంత్రం దేవతానగర్‌లో పేలుళ్ల జరుపుతున్న ప్రాంతంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జనావాసాల మధ్య పేలుళ్ల నిర్వహించాలంటే రెవెన్యూ, అగ్నిమాపకశాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అయితే తమ ఇళ్ల మధ్య భవననిర్మాణానికి పేలుళ్లు సాగిస్తున్న రియల్టర్ అనుమతులు లేకుండా రాత్రివేళల్లో బ్లాస్టింగ్‌కు పాల్పడుతూ.. పెద్ద పెద్ద శబ్దాలతో బండలను పగులగొడుతున్నాడని వాపోయారు. దీంతో రాళ్లు తమ ఇళ్లపై పడటమే కాకుండా రాత్రిపూట నిద్రపోతున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇళ్ల మధ్య బ్లాస్టింగ్ కాకుండా వేరేలా పనులు చేసుకోవాలని కోరితే... తమను బెదిరిస్తూ.. దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు అనుమతులు లేకుండా జరుగుతున్న బ్లాస్టింగ్‌లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు మల్లికార్జున, ప్రసన్న, జ్యోతి తదితరులు వినతిచేశారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

కేవిపల్లె: మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ కేఎస్ రాజు మాదిగ అన్నారు. శనివారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ యువసేన ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో మండలంలోని కొండకింద మాదిగ పల్లెలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో షెడ్యూల్ కులాల ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం ఈనెల మూడవ వారంలో చలో మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. గండికోట వెంకటేష్, కన్వీనర్ వెంకటాచలపతి, కో-ఆర్డినేటర్ గురప్పయ్య, నాయకులు శీను, వెంకటరమణ, బాలకృష్ణ, సుధాకర్‌లు పాల్గొన్నారు.